నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 22 నవంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సూపర్ స్పెషాలిటీ దవాఖాన
నిర్మాణానికి శంకుస్థాపన

మంచిర్యాల అర్బన్, నవంబర్ 21 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో రూ. 300 కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాతా శిశు దవాఖానకు గురువారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ.. రాష్ట్ర ఐటీ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు, జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీజీఎంఎస్ఐడీసీఎండీ హేమంత్ బొర్కడే, కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం సీపీ శ్రీనివాస్, డీసీపీ భాస్కర్, తెలంగాణ మినిమమ్ వేజెస్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా. హరీశ్‌రాజ్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ సులేమాన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరిండెంటెండ్ డా.హరీశ్ చంద్రారెడ్డి, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేశ్, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ల వేణు, చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్ పాల్గొన్నారు.

రోజుకు 12,000 టన్నుల ఉత్పత్తి సాధించాలి
శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించిన డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

శ్రీరాంపూర్, నవంబర్ 21 : శ్రీరాంపూర్ ఓసీపీలో రోజుకు 12,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని సంస్థ డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ఓసీపీని సందర్శించిన డైరెక్టర్ ఓసీపీ క్వారీలో పని స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఉత్పత్తిపై సమీక్షించారు. బొగుగ ఉత్పత్తి పెంపుదలకు పలు సూచనలు చేశారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ వోటూజీఎం సత్యనారాయణ, ఇందారం పీవో ఏవీ రెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో శ్రీనివాస్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇన్‌చార్జి మేనేజర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో వైరల్ అయిన దవాఖాన ఇన్విటేషన్ కార్డు

ప్రొటోకాల్ రగడ

దవాఖాన శంకుస్థాపనకు ఎంపీని పిలవలేదట..!

- ఇన్విటేషన్ కార్డులో ఆయన పేరు లేదని అనుచరుల ఆవేదన
- దళితులపై చిన్నచూపా.. అంటూ కోడై కూసిన సోషల్ మీడియా
- పీఎస్సార్ ఆహ్వానించకపోవడం వల్లే గడ్డం ఫ్యామిలీ మొత్తం రాలేదనే చర్చ
- కాంగ్రెస్‌లో అగ్గిరాజేసిన మంత్రుల మంచిర్యాల పర్యటన

మంచిర్యాల, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో ఎప్పుడు మంత్రుల పర్యటన ఉన్నా.. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలను బయటపెట్టేందుకే అన్నట్లుగా ఉంటుంది. రాష్ట్ర మంత్రుల పర్యటన ఉన్న రోజు స్థానిక నాయకుల మధ్య అంతర్గత గొడవలు ఏదో ఒక రకంగా బయటపడుతూనే ఉంటాయి. అంతకు ముందు చెన్నూర్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటన అర్ధాతరంగా రద్దు అయిన విషయం విదితమే. మంచిర్యాల ఎమ్మెల్యే పీఎస్సార్ కారణంగానే అది రద్దు అయ్యిందనే ప్రచారం నడిచింది. కాగా, గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ శంకుస్థాపన కార్యక్రమానికి వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వచ్చారు. ఈ పర్యటన జిల్లా కాంగ్రెస్ పార్టీలో మరోసారి అగ్గిరాజేసింది. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రొటోకాల్ పాటించలేదని, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను అసలు ఈ ప్రోగామ్‌కే పిలవలేదని ఎంపీ వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. దవాఖాన శంకుస్థాపన ఆహ్వానంలో ఎంపీ పేరు పెట్టకుండా దళితులను అవమానించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంత్రుల పేర్లు మాత్రమే పెట్టి దళితుడైన ఎంపీపై చిన్నచూపు చూశారంటూ సోషల్ మీడియాలో ఇన్విటేషన్ కార్డు ఫొటోలను పెట్టి వైరల్ చేశారు. గతంలో చెన్నూర్‌లో మంత్రుల పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ఫొటోలను ఫ్లెక్సీల్లో వేయలేదని, దాన్ని మనసులో పెట్టుకొనే ఈ కార్యక్రమానికి ఉద్దేశ పూర్వకంగానే ఎంపీని పిలవలేదనే చర్చ నడిసింది. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మాత్రం ఎంపీ ఫొటోలు పెట్టి.. ఆయన్ని పిలవకుండా అవమానించారని.. పేరుకు మాత్రమే ఫ్లెక్సీల్లో ఫొటోలు వేసి చేతులు దులుపుకున్నారని గడ్డం వర్గం నాయకులు చెప్పుకుంటున్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతుండగా ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

గడ్డం ఫ్యామిలీ మొత్తం రాలే

జిల్లా కేంద్రంలో మంత్రుల పర్యటన ఉన్నా.. చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, వినోద్ సహా ఎంపీ గడ్డం వంశీ కూడా హాజరు కాలేదు. స్థానిక ఎమ్మెల్యే నుంచి ఆహ్వానం లేకపోవడంతోనే వారు రాలేదనే చర్చ నడిచింది. సరే ఎమ్మెల్యేలను పిలవపోతే పిలవలేదు. ప్రొటోకాల్ ప్రకారం ఎంపీనైనా పిలవాలి కదా.. అని ఆ వర్గం నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో వెన్నంటి ఉండి వంశీ కోసం ప్రచారం చేసిన ప్రేమ.. ఇప్పుడు ఎందుకు లేదంటూ మండిపడుతున్నారు. రాజకీయాలు ఏమైనా ఉంటే అవి అంతర్గతంగా ఉంచుకోవాలి కాని.. ఇలా అధికారిక పదవిపై క్లారిటీ ఇచ్చి, జిల్లాలో పార్టీ పటిష్టానికి అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓ వైపు భోజనం.. మరోవైపు ప్రసంగం..

దవాఖాన శంకుస్థాపన కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటలకు ఉంటుందని చెప్పారు. వచ్చిన వారి కోసం భోజనాలు సైతం ఏర్పాటు చేశారు. కానీ మంత్రులు ఆలస్యంగా వచ్చారు. దీంతో కార్యక్రమం మొదలయ్యే సరికి మధ్యాహ్నం రెండు దాటింది. ముఖ్య అతిథిగా మంత్రి దామోదర రాజనర్సింహ ప్రసంగానికి ముందే సభకు వచ్చి వారిని భోజనాలకు అనుమతించారు. దీంతో మంత్రి మాట్లాడుతుండగానే వచ్చిన జనాలు వెళ్లి భోజనాలు చేశారు. ముఖ్య అతిథిగా మాట్లాడుతుండగానే భోజనాలు పెట్టడంతో ఖాళీ కుర్చీలకు ఆయన ప్రసంగం వినిపించాల్సి వచ్చింది.

కార్యక్రమాల్లో అవమానానికి గురి చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మంత్రి పదవి కోసం స్థానిక ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. వీళ్ల కారణంగా వచ్చిన ప్రతిసారీ పార్టీలో విభేదాలు బయటపడుతున్నాయంటూ ఆ పార్టీ నాయకులే చెబుతున్నారు. సాధ్యమైనంత త్వరగా మంత్రి పార్టీ పటిష్టానికి అధిష్టానం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బాబోయ్ పులి

- పానపటార్‌లోని పత్తి చేనులో కనిపించిన టైగర్
- పరుగులు తీసిన గిరిజన దంపతులు

పులి పాదముద్రలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఏజెన్సీ గ్రామాలను పులి భయం వీడడం లేదు. గురువారం జైనూర్ మండలం పానపటార్ గ్రామ సమీపంలో బూసిమెట్ట మాజీ ఎంపీటీసీ కుమ్ర భగవంత్ రావు పత్తి చేనులో పులి కనిపించిందని అదే గ్రామానికి చెందని కుమ్ర శ్యాంరావు – సంగీత తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్తుండగా.. పత్తి చేనులో పులి పడుకొని కనిపించడంతోభయంతో ఊరిలోకి పరుగులు తీశామని చెప్పారు. పానపటార్, పారా గ్రామాల ప్రజలు కర్రలు పట్టుకొని పెద్దగా కేకలు వేస్తూ రావడంతో పులి అక్కడి నుంచి వెళ్లిపోయిందని తెలిపారు. పులి పాదముద్రలను గుర్తించారు. పానపటార్ లొద్ది నుంచి తడిహత్నూర్ వైపు వెళ్లినట్లుగా గ్రామస్తులు తెలిపారు. పులి సంచారంపై అటవీ అధికారులు డప్పు చాటింపులతో అవగాహన కల్పించడం తప్ప.. దానిని ట్రాక్‌చేయడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలున్నాయి. కాగా, రెండు రోజుల క్రితం కెరమెరి అడవుల్లో కనిపించిన పులి.. పానపటార్‌లో కనిపించిన ఒక్కటి కాదని.. రెండు పులులుండే అవకాశమున్నదని జైనూర్ ఎఫ్ఆర్వో జ్ఞానేశ్వర్ తెలిపారు.

కమ్మేస్తున్న మంచు..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాను చలి వణికిస్తున్నది. అర్ధరాత్రి తర్వాత ఉష్ణోగ్రతలు పడిపోయి తీవ్రత పెరుగుతున్నది. ఇక తెల్లవారు జాము నుంచే పొగమంచు కమ్మేస్తున్నది. ఎనిమిదైనా మంచు తొలగకపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇక చిన్నా పెద్దలంతా ఒకేచోట చేరి చలిమంటలు కాగుతున్నారు. గురువారం ఉదయం కుకుడ గ్రామంలో కనిపించిన దృశ్యాలివి..

- బెజ్జూర్, నవంబర్ 21

కుకుడలో కురుస్తున్న మంచు

కుకుడలోని పత్తి పంటపై కమ్ముకున్న పొగ మంచును చీల్చుకుంటూ ఉదయిస్తున్న సూర్యుడు

స్క్రాప్ దుకాణం తరలేనా?!

ట్రాక్టర్‌లో తరలిస్తున్న స్క్రాప్

బెల్లంపల్లి, నవంబర్ 21 : పట్టణంలోని మహ్మద్ ఖాసీం బస్తీ స్క్రాప్ దుకాణాన్ని శాశ్వతంగా తరలిస్తారా.. లేక ఎప్పటిలాగే జరిమానా విధించి వదిలేస్తారా అని ఆయా బస్తీల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై స్క్రాప్ వేయడం వల్ల మహ్మద్‌ఖాసీం బస్తీ, హన్మాన్ బస్తీతో పాటు ఇతర కాలనీల వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఈ విషయమై అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. దరఖాస్తు ఇచ్చినప్పుడుల్లా అధికారులు రావడం.. నామమాత్రపు చర్యలు తీసుకోవడం.. ఆపై మరచిపోవడం పరిపాటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 17న ప్రజాదర్బార్‌లో బస్తీవాసులు కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వారి ఆదేశాల మేరకు గురువారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ వచ్చి స్క్రాప్ దుకాణాన్ని పరిశీలించారు. దుకాణం ఎత్తివేయకపోతే రూ.10 లక్షలకు బాండ్ ఇవ్వాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం రెండు స్వెటర్లను సీజ్ చేశారు. ఈ క్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ వచ్చి రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్నా చితక వస్తువులను ట్రాక్టర్‌లో ఎక్కిస్తుండగా బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోలాగ కంటితుడుపు చర్యలు కాకుండా.. పూర్తిగా ఇక్కడి నుంచి దుకాణాన్ని ఎత్తివేయాలని పట్టుబట్టారు. దీంతో ఆయన జోక్యం చేసుకొని సిబ్బంది తక్కువ ఉన్నందున వెంటనే తొలగించలేమని, రెండు రోజుల్లో తొలగిస్తామని కమిషనర్ చెప్పారు. అయినా వినకపోవడంతో మరో ఓపెన్ స్క్రాప్ గదికి తాళం వేసి సీజ్ చేశారు. రెండు మూడు రోజుల్లో పూర్తిగా తొలగించకపోతే, స్క్రాప్‌కు వాడే వాహనాల లైసెన్సులను రద్దు చేయిస్తామని ఆర్డీవో యజమానిని హెచ్చరించారు.

మంచం పట్టిన మామిడిగూడెం

జ్వరాల బారిన గిరిజనులు

- ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- అందని ప్రభుత్వ వైద్య సేవలు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానలకు పట్టించుకోని అధికారులు

జ్వరంతో బాధ పడుతున్న వృద్ధుడు

కాసిపేట, నవంబర్ 21 : మామిడిగూడెం జ్వరాలతో మంచం పట్టింది. వారం రోజులుగా వైరల్ ఫీవర్లు విజృంభిస్తుండగా, గిరిజనం అవస్థలు పడుతున్నది. రోజు రోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతున్నది. ఏ వాడలో చూసినా జ్వర పీడితులే కనిపించడం ఆందోళనకు గురిచేస్తున్నది. కీళ్ల నొప్పులతో లేచి నడవలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం 20 మందికి పైగా బాధపడుతుండగా, మరి కొందరు దవాఖానల పాలయ్యారు. గ్రామంలో పారిశుధ్యం పడకేయడం వల్లే జ్వరాలు ప్రబలాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తా చెదారం దర్శనమిస్తుండగా, డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి మురుగు నీరంతా రోడ్లపై పారుతున్నది. దుర్వాసనతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇక దోమలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వం వైద్య సేవలు అందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నారు. ఇక ఆర్థిక స్థోమత లేని వారు స్థానికంగా ఉండే ఆర్ ఎంపీల వద్దకు వెళ్లి గోలీలు తెచ్చుకొని వేసుకుంటున్నారు. గ్రామంలోని పరిస్థితిని వివరిస్తూ అధికారులకు ఫొటోలతో సహా పంపించినా పట్టించుకున్న పాపాన పోలేదని అడవిబిడ్డలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించడమే గాక వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వారు వేడుకుంటున్నారు.

జ్వరంతో బాధపడుతున్న గ్రామస్తులు

రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

చేతి పంపు కింద స్నానాలు చేస్తున్న ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

ఆశ్రమాల్లో చన్నీటి స్నానం

ఆసిఫాబాద్ జిల్లాలోని వసతి గృహాలు, ఆశ్రమాల్లో పనిచేయని సోలార్ హీటర్లు

- ఒక్కోచోట రూ. 3 లక్షలతో ఏర్పాటు
- చేతి పంపులు, ట్యాంకుల వద్ద విద్యార్థుల అవస్థలు
- గడ్డకట్టే చలితో అనారోగ్యం
- పట్టించుకోని అధికారులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ) : ఐటీడీఏ ఆశ్రమాలు, వసతి గృహాల విద్యార్థులకు చన్నీటి స్నానాలు తప్పడం లేదు. ఆయాచోట్ల రూ. 3 కోట్లతో ఏర్పాటు చేసిన సోలార్ హీటర్లు పనిచేయకపోవడంతో చేతి పంపులు, ట్యాంకులను ఆశ్రయిస్తూ అవస్థలు పడుతున్నారు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతుండగా, సకాలంలో తరగతులకు హాజరుకావాలనే ఉద్దేశంతో ఉదయం గడ్డకట్టుకుపోయే చలిలో స్నానాలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

పనిచేయని సోలార్ హీటర్లు

ఐటీడీఏ పరిధిలో 104 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కస్తూర్బా విద్యాలయాలు ఉన్నాయి. విద్యార్థులు చలికాలంలో ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశంతో విద్యాలయాల్లో ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్(ఐఏపీ) నిధులతో సోలీర్ ఆయాచోట్ల ఇంటిగ్రేటెడ్ యాక్షన్ ప్లాన్ (ఐఏపీ) నిధులతో సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశారు. ఎలాంటి టెండర్లు లేకుండానే ఓ సంస్థకు ఆశ్రమాల్లో సోలార్ హీటర్లు ఏర్పాటు చేసే బాధ్యతను అప్పగించారు. ఒక్కోచోట రూ. 3 లక్షలతో సోలార్ హీటర్ ఏర్పాటు చేశారు. అయితే నాసిరకమైన హీటర్లను ఏర్పాటు చేయడం వల్ల అవి ఒక్క రోజు కూడా పనిచేయలేదన్న ఆరోపణలున్నాయి. సోలార్ వాటర్ హీటర్ల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఇంజినీరింగ్ అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆయా చోట్ల చదువుతున్న విద్యార్థులు చేతి పంపుల వద్ద, నీటి ట్యాంకుల వద్ద చల్లని నీళ్లతో స్నానాలు చేస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇకనైనా సోలార్ హీటర్లను బాగు చేయించాలని తమ ఇబ్బందులు దూరం చేయాలని వారు కోరుతున్నారు.

సిర్పూర్-యూ కేజీబీవీ పాఠశాలలో పనిచేయని సోలార్ హీటర్